క్లుప్తంగా

లైసెన్సులు తప్పనిసరి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం అర్బన్: ఆటో డ్రైవర్లు లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన బుధవారం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ వాహనాలకు సంబంధించిన ఆర్‌సీలు, డాక్యుమెంట్లు వాహనంలో ఉంచుకోవాలని తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఆటోలను ఎక్కడ పడితే అక్కడ ఆపడం, మలుపు వద్ద ఎలాంటి సిగ్నల్ లేకుండా తిప్పడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్ల పేర్లు, అడ్రస్, ఫోన్‌నంబర్ పూర్తి వివరాలతో డ్రైవర్ కూర్చునే సీటుకు వెనుకవైపు డిస్‌ప్లే వేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ శ్యామ్‌రావు, వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, టూటౌన్ సీఐ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

బత్తలపల్లి: ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్డు నిబంధనలు పాటిస్తూ ఆటోలను నడుపుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఆయన ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఇతరులకు ఆటంకాలు, ఇబ్బందులకు గురి చేయకుండా వాహనాలు నడుపుకోవాలని సూచించారు. రోడ్డుపై ఉన్న మార్కులోపు వాహనాలు, ద్విచక్రవాహనాలను ఆపుకోవాలని వాహనదారులకు సూచించారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుర్గానగర్‌లో 'పల్లెనిద్ర'



దుర్గానగర్‌వాసులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని దుర్గానగర్‌లో బుధవారం రాత్రి పోలీసులు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రజలతో సీఐ అశోక్‌కుమార్ సమావేశం నిర్వహించారు. వార్డులో ఎవరైనా అనుమానాస్పదంగా తిరిగితే సమాచారం అందించాలన్నారు. నేరాలకు పాల్పడితే జరిగే పరిణామాలు, పడే జైలుశిక్షలను వివరించారు. సైబర్ క్రైం, దిశా యాప్, బాల్య వివాహాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.


విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

బత్తలపల్లి: సమాజం ఆదరిస్తే విభిన్న ప్రతిభావంతులు కూడా మేధావులేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో మాంఫో ఫెరర్ విభిన్న ప్రతిభావంతుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా డీడీ ఎస్టీఎల్ యల్లమ్మ, సెంటర్ సిస్టర్స్ నక్షత్రమ్మ, క్యాథిలిన్, ఏపీహెచ్‌వి కోఆర్డినేటర్ ఉమాదేవి, అర్థో మాజీ ఎస్టీఎల్ నాగరాజు, ఏటీఎల్ రుక్మాంగద, ఉమెన్స్ ఎస్టీఎల్ సంజీవులు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సాధారణ వారి కంటే ప్రత్యేక అవసరాల పిల్లల్లో మేధా సంపత్తి అధికంగా ఉంటుందన్నారు. అంతకుముందు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కిల్ కౌన్సిలర్స్ రమాదేవి, హనుమంతు, మండల సమాఖ్య ప్రతినిధులు జనార్దన్‌నాయుడు, గంగాదేవి, వేణు, నాగప్ప, సెంటర్ పిల్లలు పాల్గొన్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

పుట్టపర్తి: జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం బుధవారం ఉపాధ్యాయుడు జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి దివ్యాంగ పిల్లలకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు రమణారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

న్యాయవాదుల ర్యాలీ



ధర్మవరం అర్బన్: భూ యాజమాన్య హక్కు చట్టం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ సుబ్బారావు డిమాండ్ చేశారు. పట్టణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పురవీధుల్లో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. బీఆర్ అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ చిరస్మరణీయుడు



కదిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు



ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి

కదిరి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కొలిమి జిలాన్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం వారు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌అంబేడ్కర్ చూపిన బాటలో పయనిస్తున్నారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులతో పాటు నామినేషన్ పనుల్లో కూడా 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నారని తెలియజేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు ఏనాడూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పట్టించుకోలేదని, కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఆయా వర్గాలు గుర్తుకొస్తారని విమర్శించారు. కౌన్సిలర్లు రాంప్రసాద్, బొబ్బిలి రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్, కొమ్ము విజయభాస్కర్, లింగాల లోకేశ్వరరెడ్డి, బాహావుద్దీన్, నాగమల్లు, మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు రాష్ట్ర నాయకులు ఆనంద్, జిల్లా అధ్యక్షులు నాగేంద్రనాథ్ తదితరులు ఉన్నారు.

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీఎం మైనోద్దీన్, అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్, హరిత, ఉద్యోగులు రమణ, సుధాకర్, వెంకటనర్సుతో పాటు పలువురు పాల్గొన్నారు.

గాండ్లపెంటలో..

గాండ్లపెంట: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్‌రావ్ అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చూపిన బాటలో నడుస్తూ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక, రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహాగౌడ్, ఎస్సీ, ఎస్టీ నాయకులు మేకల నరసింహులు, గోపాల్‌నాయక్, ఎస్ఐ వెంకటనారాయణ, వార్డెన్ సుబ్బరాయుడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలో...

బత్తలపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని బత్తలపల్లిలో ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీఓ కార్యాలయం, ఎస్సీ కాలనీల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీఓ సాయిమనోహర్, వైస్ ఎంపీపీలు గజ్జెల వెంగళరెడ్డి, సాకే పార్వతి అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

తాడిమర్రిలో...

తాడిమర్రి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్ సీపీ దళిత నాయకులు బండారు పెద్ద ఓబిలేసు కోరారు. బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుని దళిత నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దళిత నాయకులు బండారు నాగభూషణం, బీసాని లక్ష్మీ నారాయణ, గుజ్జల శ్రీనివాసులు, జవాబు చిన్న నరసింహులు, తదితరులున్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దాం

పుట్టపర్తి టౌన్: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిద్దామని ఎమ్మార్పీఎస్ నాయకులు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతిని బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు, ఫొటో సాయి, ఎస్టీడీ నరశింహులు, పైపల్లి నరశింహులు, సత్తెన్న, వెంకటరాముడు, రామయ్య, పెద్దన్న, నాగరాజు, నరశింహులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేడ్కర్ వర్ధంతి

కనగానపల్లి: మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు వేపకుంట పోతన్న, ముక్తాపురం మూర్తీ, కనగానపల్లి నాగేష్, కోనాపురం ఆదినారాయణ, తూంచర్ల ఆంజనేయులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్లో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఎమ్మార్పీస్ నాయకులు బుధవారం బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కోటప్ప, మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, ఉపాధ్యక్షులు నారాయణ, మండల కార్యదర్శి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పుట్టపర్తి ఎమ్మార్పీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ ప్రసాద్, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

ధర్మవరం అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని తహసీల్దార్ యోగేశ్వరిదేవి తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్ సమక్షంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం పట్టణ కార్యదర్శి నామాల నాగార్జున, రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల అధ్యక్షులు ఆదినారాయణ, కార్యదర్శి ఆయుబ్‌ఖాన్, నాయకులు వెంకటస్వామి తదితరులున్నారు.

శుభకార్యం



పుట్టపర్తి: సీఎం ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం కుమార్తె వివాహం విజయవాడలో బుధవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

8న సచివాలయం ప్రారంభోత్సవం

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాల చెరువు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఈ నెల 8న (శుక్రవారం) ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ప్రారంభిచనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రకాష్ పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

యువతి ఆత్మహత్యాయత్నం

తనకల్లు: మండల పరిధిలోని గోళ్లవారిపల్లిలో సుభాషిణి అనే యువతి విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన మంగమ్మ, వెంకటరమణ కుమార్తె సుభాషిణి ఇంటర్ పూర్తి చేసింది. ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటోంది. బుధవారం తల్లి మంగమ్మతో కలిసి బట్టలు ఉతకడానికి వెళ్లింది. ఇంటికి వచ్చిన తరువాత తల్లి బయట బట్టలు ఆరవేస్తుండగా ఏం జరిగిందో తెలియదు కాని ఇంట్లో ఉన్న విష ద్రావకం తాగి అపస్మారకస్థితిలో పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం హుటాహుటినా తనకల్లు 30 పడకల ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మతి స్థిమితం లేని వ్యక్తి మృతి

తలుపుల: గొల్లపల్లితండా సమీపంలోని ఓ బావిలో బుధవారం మతి స్థిమితం లేని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ మగ్బుల్ బాష తెలిపారు. వైఎస్సార్ జిల్లా మురాచింతలపల్లికి చెందిన సూర్యనాయాణరెడ్డి కుమారుడు రవిప్రకాష్‌రెడ్డి (43) నాలుగు రోజుల క్రితం ఇంట్లో గొడవపడి ఇంటి నుంచి వచ్చేశాడు. గొల్లపల్లితండా సమీపంలోని బావిలో మృతదేహం ఫొటో పులివెందుల పోలీసులకు పంపగా వారు మృతునిది మురాచింతలపల్లి అని గుర్తించారు. మృతునికి ఇద్దరు భార్యలున్నారు.

క్లెయిములను వెంటనే పరిష్కరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ భాగ్యరేఖ

పుట్టపర్తి అర్బన్: వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన క్లెయిములు, ఆన్‌లైన్ ద్వారా వచ్చిన క్లెయిములను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన క్లెయిములను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి పరిష్కరించాలన్నారు. అర్హులైన ఓటర్లను ఒక్కరినీ తొలగించరాదన్నారు. క్షుణ్ణంగా పరిశీలించి మార్పులు చేర్పులు చేయాలన్నారు. ప్రతి విషయం రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఫారం-6 దరఖాస్తులు 651, ఫారం-7కు 133, ఫారం-8కు 219 కలిపి 1,003 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, డీటీలు నరసింహులు, రహిమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

పుట్టపర్తి అర్బన్: పేద ప్రజలకు ఎన్నో వైద్య సేవలు ఉచితంగా అందిస్తూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలని, ప్రతి గర్భిణీ అవగాహన పెంపొందించుకోవాలని డాక్టర్ జ్యోత్స్న పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం బత్తలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీహెచ్ఓ నగేష్‌తో కలిసి ఆమె మాట్లాడుతూ గర్భిణులకు గర్భం దాల్చినప్పటి నుంచి ఎన్నో పరీక్షలు నిర్వహిస్తూ మందులు అందజేస్తూ వైద్య సేవలు అందిస్తుంటారన్నారు. వారం ముందే ఆస్పత్రికి 108 ద్వారా సురక్షితంగా తీసుకెళ్లి కాన్పు చేసి తిరిగి ఇంటికి చేరుస్తున్నారన్నారు. ప్రతి వారం తీసుకోవాల్సిన ఆహారం, ఐరన్ సిరప్, క్యాల్షియం అందిస్తుంటారన్నారు. మాతా శిశు సంరక్షణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. వైద్యులు అందించే అన్ని సూచనలు పాటిస్తే ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని, దీంతో పాటు తల్లి పాల విశిష్టతను తెలియజేస్తారన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. వ్యాయామంతో శారీరక ఉల్లాసం కలుగుతుందని, ఒత్తిడి తగ్గి ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు చంద్రకళ, ఎంఎల్‌హెచ్‌పి సత్యమ్మ, సిబ్బంది జ్యోతి, లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవళిక, అంజనమ్మ తదితరులు ఉన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో పాల్గొనాలి

ఎన్పీకుంట: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని ఎంపీపీ ఈటి రాము పిలుపునిచ్చారు. 5 క్రీడలకు సంబంధించిన క్రీడా పరికరాలను బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చేతుల మీదుగా పంచాయతీ కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులకు ప్రభుత్వం క్రీడా పరికరాలు ఇచ్చి ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఎంపీడీఓ ఆదినారాయణ, నారాయణస్వామి, రామక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు ముబారక్, రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోండి

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఆయా క్రీడాంశాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం పెడపల్లిలో 'ఆడుదాం ఆంధ్రా' పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాంశాలు ఉంటాయన్నారు. స్థానిక సచివాలయం, 1902కి కాల్ చేయడం, ఆడుదాం ఆంధ్రా వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయపాల్‌రెడ్డి, తేజశ్రీ, నరేష్, మహిళా పోలీసులు ఉన్నారు.

దివ్యాంగుల భవనానికి స్థలం కేటాయింపు

తలుపుల: సమస్యలపై సమావేశం నిర్వహించుకోవడానికి స్థలం కేటాయించాలని తహసీల్దార్ కే.శ్రీధర్‌కు మండలంలోని దివ్యాంగులు విన్నవించుకుని వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందించి గంజివారిపల్లి రోడ్డులో ఉన్న జగనన్న లేఅవుట్ దగ్గర 3 సెంట్ల స్థలం పట్టాను తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అందజేశారు. దివ్యాంగ సంఘం అధ్యక్షులు శ్రీరాములు మాట్లాడుతూ గతంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో తమకు స్థలం కేటాయించినందుకు తహసీల్దార్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపై మురుగు నీరు పోస్తే కఠిన చర్యలు

కొత్తచెరువు: రోడ్లపైకి మురుగు నీరు పోస్తే కుళాయి కనెక్షన్ కట్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని డీపీఓ విజయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కొత్తచెరువులో పర్యటించిన ఆయన పలు ప్రాంతాల్లో రోడ్లపై డ్రైనేజీ పొంగి పొర్లుతుండడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు, సిబ్బందిని మందలించారు. రోడ్లపై నీరు పోస్తే నోటీసులు అందించి కొళాయి కనెక్షన్ తొలగించాలని ఆదేశించారు. డ్రైనేజీలను శుభ్రం చేయించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ శివకుమారి, పంచాయతీ కార్యదర్శి గోపాల్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలు మెరుగ్గా అమలుకే కులగణన



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు, అణగారిన వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించి ప్రజల జీవన ప్రమాణాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మెరుగుపరిచారని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి తెలిపారు. పథకాలను మరింత మెరుగ్గా అమలు చేసేందుకు కులగణన కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ధర్మవరం మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులు, మహిళలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన 67 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారన్నారు. సంక్షేమం, అభివృద్ధి పథకాలను మరింత మెరుగైన రీతిన అమలు చేయడానికి కులగణన చేపట్టామన్నారు. కుల గణన ద్వారా అన్ని కులాలకు చెందిన ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, జనాభా తదితర వివరాలు సేకరించాలన్నారు. సచివాలయ సిబ్బంది ఇంటింటిని సందర్శించి కులగణన డేటా మొబైల్ యాప్ ద్వారా సేకరిస్తారన్నారు. సాంఘిక సంక్షేమశాఖ రూపొందించిన ప్రకారం డేటా సేకరిస్తారని వివరించారు. వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తారని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన కులగణన మండల, డివిజనల్, జిల్లాస్థాయి అధికారులు కూడా తనిఖీ చేయనున్నారని తెలిపారు. ధర్మవరం పట్టణంలో ఈనెల 9వతేది నుంచి 18వతేది వరకు కుల గణన సర్వే 10రోజులపాటు నిర్వహించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్‌నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులగణన పారదర్శకంగా నిర్వహించాలి

కొత్తచెరువు: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కులగణన కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి శివరంగప్రసాద్, తహసీల్దార్ రామాంజినేయరెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి వారం పాటు సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారం సాహెబ్, ఏపీఓ నాగిరెడ్డి, కులసంఘ నాయకులు ముద్దల భాస్కర్, అశోక్, రఫి, మున్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కులగణనను గ్రామాల్లో పక్కాగా చేపట్టాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి, ఎంపీడీఓ సాయిమనోహర్‌లు ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వేలో సేకరించిన డేటాను గోప్యంగా ఉంచాలని స్పష్టం చేశారు. అంతకు ముందు డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఎంఈఓ చాముండేశ్వరి, ఈఓఆర్డీ దివాకర్, వైస్ ఎంపీపీలు గజ్జెల వెంగళరెడ్డి, సాకే పార్వతి, సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, చెడిపోతల గోపాల్, అక్కిం దామోదర్, ప్రభాకరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, తదితరులున్నారు.

జగనన్నను మళ్లీ ఆశీర్వదించండి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్యకర్తలు



ఓడీచెరువు: సంక్షేమ బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఓడీచెరువు: నవరత్నాలు ప్రతి గడపకూ చేరాలంటే జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీపీ తుమ్మల పర్వీన్ భాను పేర్కొన్నారు. మండలంలోని వెంకటాపురం సచివాలయంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్ బాషా మాట్లాడుతూ వెంకటాపురం సచివాలయ పరిధిలో 564 కుటుంబాలకు రూ. 20.47 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం

తలుపుల: అన్ని వర్గాల సంక్షేమం జగనన్నతోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. ఈదులకుంట్లపల్లిలో సర్పంచ్ కుమారి బాయి, మండల కన్వీనర్ పయాజ్ అహమ్మద్ ఆధ్వర్యంలో సంక్షేమ క్యాలెండర్, పార్టీ జెండా ఎగురవేశారు. జగనన్న కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రఫినాయక్, గ్రామ కన్వీనర్లు దేవేంద్ర నాయక్, అంజన సుబ్బారెడ్డి, జయప్ప నాయుడు, ఎరమరెడ్డి, వలి, అంజి, నౌషాద్ పాల్గొన్నారు.

వేళ్లమద్దిలో..

నల్లమాడ: మండలంలోని వేళ్లమద్ది, కొండక్రింద తండా గ్రామ పంచాయతీలకు సంబంధించి వేళ్లమద్ది గ్రామ సచివాలయంలో బుధవారం 'వై ఏపీ నీడ్స్' జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బొజ్జినాయక్, పార్వతీ బాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి, వైస్ ఎంపీపీ, మండల కన్వీనర్ కే. సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సచివాలయం పరిధిలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల బోర్డును, సచివాలయం బయట పార్టీ జెండాను ఆవిష్కరించారు. మా నమ్మకం నువ్వే జగన్ కిట్లు పంపిణీ చేశారు. నాయకులు సీతారాం, హరి, రాంమోహన్, చిన్నపరెడ్డి, గేమేనాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌నాయక్, గణేష్‌నాయక్, ప్రసాద్ నాయక్, కార్యదర్శి ఉస్మాన్, చందారెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో..

ముదిగుబ్బ: మండలంలోని కొండగట్టుపల్లిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, నాయకులు సేవేనాయక్, మల్లగుండ్ల భాస్కర్, చంద్ర, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ధర్మవరం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్‌కు రైళ్లు రద్దయిన నేపథ్యంలో ధర్మవరం–పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు పుట్టపర్తి డిపో మేనేజర్ ఇనయతుల్లా పేర్కొన్నారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు డీఎం 9959225857, 9959225859, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ 7382860486, 6300220650, బస్‌స్టేషన్ 08555–287210లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గొర్రె పిల్లల అపహరణ

కనగానపల్లి: కుర్లపల్లిలో ఏడు గొర్రె పిల్లలను దొంగలు అపహరించినట్లు కాపరి బయన్న పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ హనుమంతరెడ్డి కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కనగానపల్లి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కదిరప్ప ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులతో కలసి తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు బి.లక్ష్మీదేవి, వనిత, అనిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

10న బత్తలపల్లిలో శాకాహార ర్యాలీ

బత్తలపల్లి: పిరమిడ్ స్పిరిచువల్ మూమెంట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న బత్తలపల్లిలో శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బత్తలపల్లి హరిహర ధ్యాన కేంద్రం కమిటీ సభ్యులు మదనాపు కొండన్న, నెట్టెం నాయుడు, గోపాల్ తెలిపారు. బుధవారం బత్తలపల్లిలో వారు మాట్లాడుతూ ర్యాలీకి ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి శాకాహారులు, ధ్యాన సభ్యులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాల పరిశీలన

అమడగూరు: మహమ్మదాబాద్ గ్రామ సచివాలయ పరిధిలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను బుధవారం ప్రజాప్రతినిధులు పరిశీలించారు. పలువురు లబ్ధిదారులు బిల్లులు మంజూరు కాలేదని, కొలతల్లో తేడాలున్నాయనే సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. వెంటనే సంబంధిత హౌసింగ్ అధికారులతో మాట్లాడి సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శేషూరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ జయప్ప, మండల పార్టీ పరిశీలకుడు డాక్టర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.